W W W.EPAPER.MAHADAILY.COM

# మహా పత్రిక





ఖమ్మం

భద్రాద్రి కొత్తగూడెం

9-3-2025

## రైల్వే లైన్ మంజూరుకు మంత్రి తుమ్మల కృతజ్ఞతలు

- సారపాక వరకు తక్షణమే పనులు పూర్తిచేయాలని విజ్ఞప్తి
- సత్తుపల్లి-కొవ్వూరు, పెనుబల్లి-కొండపల్లి రైల్వే ప్రాజెక్టుల కోసం కేంద్రానికి లేఖ
- రైతుల రవాణా సౌకర్యాల మెరుగుదలకూ ఈ ప్రాజెక్టులు కీలకం
- రాష్ట్రాభివృద్ధికి రైల్వే ప్రాజెక్టుల పుష్కల సహకారం
- రైల్వే అభివృద్ధిపై తెలంగాణ మంత్రుల చొరవ



03

## కోడిపుంజు వివాదం అదనపు ఎస్సై దాష్టీకం

- కోళ్ల ఫారంలో చిత్రహింసలు దళితుడికి కరెంట్ షాక్‌లు
- విచారణ పేరుతో అమానుషంగా వ్యవహరించిన అదనపు ఎస్సై
- దోషులకు శిక్ష పడాలని దళిత సంఘాల ఆగ్రహం



08



06

# ఆధునిక మహిళలు.. ముందు తరాలకు ఆదర్శం

## మహిళా గెజిటెడ్ అధికారుల విజయోత్సవం

- సామాజిక సేవలోనూ ముందున్న మహిళలు
- పరిపాలనలో మహిళల కీలక పాత్ర
- ఉద్యోగ బాధ్యతలతో పాటు కుటుంబ సమతుల్యత
- క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలతో ఉత్సాహభరిత వేడుక

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్ అసోసియేషన్ మహిళా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమం మహిళా సాధికారతకు ప్రతిబింబంగా నిలిచింది. ఈ వేడుకలో మహిళా గెజిటెడ్ అధికారులు తమ సేవా స్ఫూర్తిని చాటుతూ, అనేక రంగాల్లో ముందుకు సాగుతున్న నారీశక్తిని ప్రోత్సహించారు. సమాజంలో మార్గదర్శకత్వం వహిస్తున్న ఆధునిక మహిళలు భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలవాలన్న సందేశాన్ని ఈ కార్యక్రమం స్పష్టంగా ప్రతిబింబించింది.

ఖమ్మం - మహా

### మహిళా గెజిటెడ్ అధికారుల విజయోత్సవం

తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్ అసోసియేషన్ మహిళా విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుక ఘనంగా జరిగింది. అధ్యక్షురాలిగా జి. ఉషశ్రీ, కార్యదర్శిగా పి. సుధారాణి బాధ్యతలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీజీవో రాష్ట్ర అధ్యక్షులు శ్రీ ఏలూరి శ్రీనివాసరావు పాల్గొని మహిళా అధికారుల దృఢ సంకల్పాన్ని ప్రశంసించారు. నేడు మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ, ఉద్యోగ సంఘాలలోనూ తమ స్థానాన్ని నిర్మించుకుంటున్నారని ఆయన అన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ పి. శ్రీజ, ఖమ్మం జిల్లా అడిషనల్ కలెక్టర్, ప్రత్యేక అతిథిగా హాజరై మహిళా అధికా రులకు ప్రోత్సాహాన్ని అందించారు.



## సత్తుపల్లి కోల్ సైలో బంకర్

- ప్రజలకు పెనుముప్పు
- పర్యావరణాన్ని విషతుల్యం చేస్తున్న బంకర్
- తక్షణ చర్యలే పరిష్కారం



04

FOLLOW: @ANNTELUGU
9-3-2025
WWW. EPAPER.MAHAADAILY.COM
భద్రాద్రి కొత్తగూడెం
మహా పత్రిక
ANN తెలుగు

# రాజీ మార్గమే రాజ మార్గం

## లోక్ అదాలత్ ద్వారా శాంతియుత పరిష్కారమే అసలైన న్యాయం

- తగాదాలకు న్యాయస్థానం వద్ద ముగింపు కాదు, పరస్పర అవగాహనతో తీర్మానం అత్యుత్తమం
- ఖమ్మం జిల్లా లోక్ అదాలత్‌లో 12 వేల కేసుల పరిష్కార లక్ష్యం
- సమాజ శాంతికి, వ్యక్తిగత మానసిక ప్రశాంతతకు లోక్ అదాలత్‌లు అత్యంత ఉపయోగకరం
- జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జి. రాజగోపాల్






**ఖమ్మం - మహా:** న్యాయస్థానాల మెట్లెక్కిన ప్రతి సమస్యకు తీర్పు రావాలనే నిరీక్షణ అవసరం లేదని, పరస్పర అవగాహన, రాజీ మార్గం ద్వారా సమస్యలను తక్షణమే పరిష్కరించుకోవచ్చని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జి. రాజగోపాల్ స్పష్టం చేశారు. శనివారం ఖమ్మం జిల్లా కోర్టులో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, కోర్టుల్లో ఏళ్ల తరబడి కేసులు నడిపించుకోవడం వల్ల నష్టమే తప్ప లాభమేమీ ఉండదని, రాజీ ద్వారా సమస్యలను పరిష్కరించుకోవడమే అత్యుత్తమ మార్గమని పేర్కొన్నారు. రాజీ కుదిరే కేసులను పరస్పర అంగీకారంతో లోక్ అదాలత్‌లో తేలికగా ముగించుకోవచ్చని, దీనివల్ల న్యాయ వ్యవస్థపై భారం తగ్గడంతో పాటు, కక్షిదారులకు మానసిక ప్రశాంతత లభిస్తుందని వివరించారు.

### లోక్ అదాలత్ - శాంతియుత పరిష్కారానికి మార్గదర్శి

కోర్టుల్లో కేసులు విచారణకు వచ్చి, తీర్పు వెలువడే వరకు సంవత్సరాల తరబడి సమయం పట్టడం, కక్షిదారులపై ఆర్థిక, మానసిక ఒత్తిడి పెరిగిపోవడం నేటి న్యాయ వ్యవస్థలో ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలని న్యాయమూర్తి రాజగోపాల్ పేర్కొన్నారు. అయితే, లోక్ అదాలత్ ద్వారా తగాదాలను తక్షణమే పరిష్కరించుకునే అవకాశం ఉండడం, దీని వల్ల ఇరువర్గాలకు న్యాయంగా, ఆర్థికంగా, మానసికంగా లాభమని వివరించారు.

### ఖమ్మం జిల్లా లోక్ అదాలత్ - 12 వేల కేసుల పరిష్కార లక్ష్యం

గత లోక్ అదాలత్‌లో ఖమ్మం జిల్లాలో 10,500 కేసులు పరిష్కరించగా, తాజా లోక్ అదాలత్‌లో 12,000 కేసులను పరిష్కరించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని, ఇందుకోసం జిల్లా న్యాయస్థానాల్లో 9 ప్రత్యేక లోక్ అదాలత్ బెంచ్‌లను ఏర్పాటు చేశామని న్యాయమూర్తి వెల్లడించారు. ఈ ప్రత్యేక బెంచ్‌ల ద్వారా క్రిమినల్ కాంపౌండబుల్ కేసులు, సివిల్ తగాదాలు, ఆస్తి విభజన సమస్యలు, వైవాహిక వివాదాలు, బ్యాంకు రికవరీ, విద్యుత్ చౌర్యం, చెక్ బౌన్స్ కేసులు, రోడ్డు ప్రమాదాలు, డ్రంక్ అండ్ డ్రైవ్, ఇతర చిన్నచిన్న కేసులను పరిష్కరించేందుకు ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

### లోక్ అదాలత్‌లో రాజీ - శాశ్వత పరిష్కారం

సామాజికంగా, వ్యక్తిగతంగా న్యాయపరమైన సమస్యలు జీవితాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తుంటాయని, అందుకే రాజీ మార్గం ద్వారా సమస్యలు పరిష్కరించుకోవడం ఉత్తమమని న్యాయమూర్తి రాజగోపాల్ వివరించారు. రాజీ కుదిరితే కక్షిదారుల మధ్య శత్రుత్వం పూర్తిగా తొలగిపోవడమే కాకుండా, ఇరువర్గాల మధ్య మళ్లీ స్నేహపూర్వక వాతావరణం నెలకొంటుందని పేర్కొన్నారు. కోర్టు తీర్పుతో ఒకరు గెలిచి, మరొకరు ఓడిపోతారు. కానీ, లోక్ అదాలత్‌లో రాజీ కుదిరితే ఇద్దరూ విజేతలుగానే నిలుస్తారు. సమస్యను మళ్లీ మళ్లీ న్యాయస్థానాల్లోకి లాక్కొచ్చే అవసరం ఉండదు. జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా కొన్ని ముఖ్యమైన కేసులను పరిష్కరించారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో భర్తను కోల్పోయిన వసంతకు రూ.14 లక్షల పరిహారం మంజూరు చేయించగా, ఉషారాణి-శివ కుటుంబ వివాదానికి కూడా సముచితమైన పరిష్కారం లభించింది.

### మహిళా దినోత్సవం సందర్భంగా న్యాయమూర్తి శుభాకాంక్షలు

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని, న్యాయమూర్తి రాజగోపాల్ మహిళా న్యాయవాదులు, న్యాయమూర్తులకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. మహిళా హక్కుల పరిరక్షణకు న్యాయ వ్యవస్థ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, మహిళలకు సంబంధించి న్యాయ వివాదాలను త్వరితగతిన పరిష్కరించేందుకు లోక్ అదాలత్‌లు అత్యంత ప్రయోజనకరంగా ఉంటాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా సెషన్స్ న్యాయమూర్తి కె. ఉమాదేవి, న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి చంద్రశేఖర్ రావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నెరేళ్ల శ్రీనివాసరావు, న్యాయమూర్తులు, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీ రవిచంద్రకి శ్రీ స్వామి సుగుణానంద గాయత్రి ఆశీస్సులు



**ఖమ్మం - మహా:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని శ్రీ అగస్త్య పీఠం స్థాపకులు శ్రీస్వామి సుగుణానంద గాయత్రి రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్రను శాలువాతో సత్కరించి చిత్రపటాన్ని బహూకరించారు. ఎన్టీఆర్ జిల్లా వీరుళ్లపాడు మండలం నరసింహారావు పాలెంలో నెలకొల్పబడిన శ్రీ అగస్త్య పీఠం స్థాపకులు, నిర్వాహకులు శ్రీస్వామి సుగుణానంద గాయత్రి శనివారం ఉదయం ఎంపీ రవిచంద్రను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి,పీఠం చిత్రపటాన్ని బహుకరించి, ఆశీర్వచనాలు పలికారు.

# వ్యవసాయ విద్యుత్ సేవల విస్తరణకు విద్యుత్ శాఖ ప్రణాళికలు

- ఖమ్మం సర్కిల్‌లో వేగవంతమైన మంజూరు చర్యలు
- రైతుల శ్రేయస్సు కోసం నిరంతర కృషి
- డిజిటల్ విధానాలతో పారదర్శకత, సమర్థత
- సరళమైన విధానంతో మెటీరియల్ వినియోగం - సమయ పొదుపు



**ఖమ్మం - మహా:** తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి రైతుల పాత్ర అత్యంత కీలకం. వ్యవసాయ రంగం మరింత బలపడేందుకు, రైతులకు అవసరమైన వనరులను అందించేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోంది. ఈ క్రమంలో ఖమ్మం సర్కిల్ పరిధిలో వ్యవసాయ విద్యుత్ సేవలను అత్యంత వేగంగా అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు విద్యుత్ శాఖ ప్రధాన అధికారి శ్రీనివాస చారి తెలిపారు. వ్యవసాయ సేవల విస్తరణను ప్రణాళికాబద్ధంగా అమలు చేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆయన వివరించారు.

### వ్యవసాయ విద్యుత్ సేవల పెరుగుదల

ఖమ్మం సర్కిల్ పరిధిలో ఇప్పటివరకు 1,15,737 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు మంజూరయ్యాయి. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఫిబ్రవరి నెలాఖరు వరకు 3,830 కొత్త కనెక్షన్లు మంజూరయ్యాయి. గత సంవత్సరం కంటే 18% పెరుగుదల నమోదైందని అధికారులు తెలిపారు. వ్యవసాయ రంగానికి ప్రాధాన్యతనిస్తూ ప్రభుత్వం చేపట్టిన విధానాల ఫలితంగా కనెక్షన్ల మంజూరు పెరుగుతోందని పేర్కొన్నారు.

### అవసరమైన సామగ్రి సిద్ధంగా ఉంచడం

వ్యవసాయ విద్యుత్ సేవల మంజూరును వేగవంతం చేసేందుకు కావాల్సిన స్థంభాలు, తీగలు, విద్యుత్ మార్గమార్పిడి యంత్రాలు ముందుగా సిద్ధంగా ఉంచామని విద్యుత్ శాఖ ప్రకటించింది. రైతులకు అవసరమైన విద్యుత్ సేవలను ఏప్రిల్, మే, జూన్ నెలల్లో మరింత వేగంగా అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

### పూర్తి ఆన్లైన్ విధానం %-% పారదర్శకత, సమర్థత

వ్యవసాయ విద్యుత్ సేవల మంజూరును పూర్తిగా అంతర్జాల విధానం ద్వారా చేపట్టారు. వ్యవసాయ శాఖ పోర్టల్ ద్వారా రైతులు తమ దరఖాస్తు స్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు. ఎక్కడ దరఖాస్తు పెండింగ్‌లో ఉందో, దానికి గల కారణాలేమిటో తెలుసుకునే వీలుందని అధికారులు తెలిపారు. ఈ విధానం ద్వారా అలస్యాన్ని తగ్గించడంతో పాటు, పారదర్శకతను పెంచడం సాధ్యమవుతోంది.

### ప్రముఖ మెటీరియల్ నిల్వ విధానం - సమయ పొదుపు

కావాల్సిన సామగ్రిని ప్రత్యేక నిల్వ విధానం ద్వారా ముందుగా బుక్ చేసుకునే అవకాశం కల్పించారు. దీని ద్వారా అవసరమైన సామగ్రిని ముందుగా రిజర్వ్ చేసుకుని, తగిన సమయంలో పొందే వీలు ఉంది.

### రైతుల సంక్షేమమే ముఖ్య లక్ష్యం

రైతుల అభివృద్ధి కోసం విద్యుత్ శాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. వ్యవసాయ విద్యుత్ సేవల మంజూరుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని, ఎలాంటి జాప్యం లేకుండా తక్షణమే మంజూరు చేసే విధంగా చర్యలు చేపట్టినట్లు శ్రీనివాస చారి వెల్లడించారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని, వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా విద్యుత్ సేవలు అందించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఆయన కోరారు.



# మహిళా సాధికారిత ప్రకటనలకే పరిమితం

**కారేపల్లి, మహా:** మహిళ సాధికారిత పాలకులు ప్రకటనలతోనే సరిపుచ్చుతున్నారని కారేపల్లి మండలం సీఐటీయు కన్వీనర్ కే.నరేంద్ర, కాంగ్రెస్ మండల అధ్యక్షులు తలారి చంద్రప్రకాష్, ఐద్వా నేతలు ఎస్.నాగమణి, కే.ఉమావతిలు అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం కారేపల్లి భాగం రామనర్సయ్య భవన్‌లో సురబాక ధనమ్మ అధ్యక్షతన సదస్సు జరిగింది. ఈసదస్సులో వారు మాట్లాడుతూ మహిళలను కోటీశ్వరులు, లక్షాధికారులను చేస్తామంటూ ప్రకటనలు గుప్పిస్తున్న పాలకులు ఆచరణలో చూపటం లేదన్నారు. సేవా రంగాలలో పనిచేస్తున్న అంగన్వాడీ, ఆశ, మధ్యాహ్నం భోజనం వర్కర్లకు ప్రభుత్వాలు కనీస వేతనం ఇవ్వక గంపెడు చాకిరి చేయిస్తుందన్నారు. ఈకార్యక్రమంలో మేదరి మంగతాయి, ఆశ వర్కర్ యూనియన్ మండల అధ్యక్షురాలు వాంకుడోత్ కమల, మాజీ సర్పంచ్ కరపటి రాంబాయమ్మ, ప్రజాసంఘాల నాయకురాళ్లు బచ్చల బుజ్జమ్మ, భవాని, మేదరి కుమారి, ఆదెర్ల దేవకరుణ, రజియా సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ ఉమెన్ ఎంప్లాయిగా డోలమైట్ ఉద్యోగి



**కారేపల్లి, మహా:** కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలో ఉత్తమ ప్రతిభ కనపర్చిన మహిళలు ఇచ్చే జాతీయ స్థాయి అవార్డును విశాఖ స్టీల్ ప్లాంట్ అనుబంధ సంస్థ మాధారం డోలమైట్ మైన్స్ ఉద్యోగి రేష్మ సుల్తానా ఎంపికైంది. డోలమైట్ మైన్స్‌లో సీనియర్ ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న రేష్మసుల్తానా విధి నిర్వహణలో చూపిన అంకుటిత దీక్షకు ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా ఉమెన్ ఇన్ పబ్లిక్ సెక్టార్ ఎక్సలెంట్(డబ్ల్యూఐపీఎస్) అవార్డును అందుకున్నారు. సీఐటీయు సభ్యురాల్కైన రేష్మసుల్తానాను శనివారం జరిగిన కార్యక్రమంలో డోలమైట్‌మైన్స్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయు) అధ్యక్ష, కార్యదర్శులు గుంపెనపల్లి నర్సింహరావు, గుర్రం వెంకటేశ్వర్లు, నాయకులు ఆర్. యేసయ్య, బీ.రమేష్, బీ.లింగయ్యలు శాలువ కప్పి సన్మానించి అభినందలు తెలిపారు.

## జాలిముడి ప్రాజెక్టు గురించి అర్హత లేని వాళ్ళు మాట్లాడటం అవివేకం



**మధిర మార్చి 8 మహా:** జాలిముడి ప్రాజెక్టు గురించి మాట్లాడే అర్హత లేని వాళ్ళు మాట్లాడటం అవివేకమని వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ అద్దంకి రవికుమార్ అన్నారు ఈ సందర్భంగా ఓ ప్రకటనలో ఆయన మాట్లాడుతూ జాలిముడి ప్రాజెక్టు దండగ దాని నిర్మాణం వలన ఉపయోగం లేదు అని ప్రచారం చేసిన మీ పార్టీ నాయకులు ఈరోజు జాలి ముడి ప్రాజెక్టును పూర్తి చేయలేదు రైతులకు అన్యాయం జరుగుతుందని ప్రెస్ మీట్ పెట్టడానికి సిగ్గుండాలి అని అన్నారు కాసుల కోసం కక్కుర్తి పడి కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మిస్తే సంవత్సరం తిరగకుండానే ఎటువంటి వరద రాకపోయినప్పటికీ పిల్లర్లు మొత్తం కృంగిపోయి ఊర్లు ఊర్లు కొట్టుక పోకుండా ఉండటం కోసం అందులో నీళ్లు ఖాళీ చేయాల్సిన పరిస్థితి వచ్చింది దాని గురించి మీ ముఠామేస్త్రి కానీ భజనపరులు గాని ఏనాడైనా మాట్లాడారా అని ప్రశ్నించారు 10 సంవత్సరాల క్రితం నిర్మించిన జాలిముడి ప్రాజెక్టు మొన్న వచ్చిన వరదలకు కాంక్రీట్ బెడ్ కొట్టుకుపోతే రెండు సంవత్సరాల క్రితం కట్టినది కొట్టుకుపోయిందని కళ్ళు లేని కబోదు వలె ఈరోజు ఓ నాయకుడు ప్రెస్ మీట్ రిలీజ్ చేయడం పట్ల చుట్టుపక్కల గ్రామాల రైతులు నవ్వుకుంటున్నారు అన్నారు.



తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పాండురంగాపురం - మల్కాన్‌గిరి రైల్వే లైన్ మంజూరు చేసినందుకు కేంద్ర రైల్వే మంత్రి అశ్విన్ వైష్ణవ్ కి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రజల రవాణా సౌకర్యాలు మెరుగుపరిచేందుకు, ముఖ్యంగా భద్రాద్రి యాత్రికులకు ప్రయోజనం కల్పించేందుకు ఈ రైల్వే మార్గం ఉపయోగ పడుతుందని తెలిపారు.

ఖమ్మం - మహా

# రైల్వే లైన్ మంజూరుకు మంత్రి తుమ్మల కృతజ్ఞతలు

### సారపాక వరకు వేగంగా నిర్మాణం

భద్రాచలం వెళ్ళే భక్తులకు రైలు మార్గం ద్వారా మెరుగైన ప్రయాణ సదుపాయాలు కల్పించేందుకు, పాండురంగాపురం – మల్కాన్‌గిరి రైల్వే మార్గాన్ని సారపాక వరకు త్వరితగతిన పూర్తి చేయాల్సిన అవసరం ఉందని మంత్రి తెలిపారు. ఇందుకు తగిన చర్యలు తీసుకోవాలని కేంద్ర రైల్వే మంత్రిని లేఖ ద్వారా కోరారు. భద్రాచలం చేరుకునే భక్తులకు సారపాక వరకైనా రైలు సదుపాయం లభిస్తే, తర్వాత భద్రాచలానికి వెళ్లేందుకు ఇతర రవాణా మార్గాలు అందుబాటులో ఉంటాయని ఆయన వివరించారు.

### గోదావరి రైల్వే బ్రిడ్జి పనులకు పురోగతి

ఈ ప్రాజెక్టులో భాగంగా, గోదావరి నదిపై నిర్మించాల్సిన రైల్వే వంతెన పనులను కూడా వేగంగా పూర్తి చేయాలని మంత్రి సూచించారు. గోదావరి పై రైల్వే బ్రిడ్జి పూర్తయితే, ఆ ప్రాంతంలోని వాణిజ్య, వ్యవసాయ, పర్యాటక రంగాలకు మరింత బలమైన మద్దతుగా నిలుస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు.

### సత్తుపల్లి-కొవ్వూరు, పెనుబల్లి-కొండపల్లి రైల్వే ప్రాజెక్టుల లేఖ

ఈ సందర్భంగా, రాష్ట్ర రవాణా మౌలిక సదుపాయాల విస్తరణలో భాగంగా సత్తుపల్లి–కొవ్వూరు మరియు పెనుబల్లి (ఖమ్మం) – కొండపల్లి (అమరావతి) వరకు కొత్త రైల్వే మార్గాలను మంజూరు చేయాలని మంత్రి లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు. ఈ రెండు ప్రాజెక్టులు కార్యరూపం దాల్చితే, వ్యవసాయ ఉత్పత్తుల రవాణా సులభతరమవుతుందని, ఈ ప్రాంత ప్రజలకు కొత్త వాణిజ్య అవకాశాలు లభిస్తాయని ఆయన వెల్లడించారు.

### రాష్ట్రాభివృద్ధికి రైల్వే ప్రాజెక్టుల సహకారం

తెలంగాణ అభివృద్ధిలో రైల్వే ప్రాజెక్టులు కీలక పాత్ర పోషిస్తున్నాయని, వీటి ద్వారా ప్రజలకు మెరుగైన ప్రయాణ సదుపాయాలు లభించడంతో పాటు, ఆర్థిక పురోగతి వేగవంతం అవుతుందని మంత్రి తుమ్మల అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ ప్రతిపాదనలను అంగీకరించి, త్వరితగతిన అనుమతులు మంజూరు చేస్తుందని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు.

## మహిళా కార్మికులకు సన్మానం

**కారేపల్లి, మహా:** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం సింగరేణి గ్రామపంచాయతీ పరిధిలోని మహిళ కార్మికులను ఎంపీవో మల్లెల రవీంద్రప్రసాద్ సన్మానించారు. సమాజాభివృద్ధికి మహిళలు మార్గదర్శకులని ఎంపీవో కొనియాడారు. ఈకార్యక్రమంలో కార్యదర్శి బీ.నిరంజన్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు తలారి చంద్రప్రకాశ్, సీపీఐ జిల్లా నాయకులు తాత వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.





### ప్రజల ఆరోగ్యానికి రక్షణ అవసరం

సత్తుపల్లి కోల్ సైలో బంకర్ వల్ల ప్రజలు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఇది కేవలం పర్యావరణ సమస్య మాత్రమే కాకుండా, ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదకర అంశం. ప్రభుత్వ అధికారులు, పరిశ్రమల యాజమాన్యాలు తక్షణ చర్యలు తీసుకోవడం మాత్రమే దీని పరిష్కారం. లేదంటే ప్రజలు తమ హక్కుల కోసం రోడ్లెక్కడం తథ్యం!

# సత్తుపల్లి కోల్ సైలో బంకర్

## ప్రజలకు పెనుముప్పు ... పర్యావరణాన్ని విషతుల్యం చేస్తున్న బంకర్

**ఖమ్మం - మహా:** ఖమ్మం జిల్లా సత్తుపల్లి పట్టణంలో ఏర్పాటు చేసిన కోల్ సైలో బంకర్ ఇప్పుడు ప్రజల ఆరోగ్యానికి, పర్యావరణానికి పెద్ద ముప్పుగా మారింది. ఈ బంకర్ ద్వారా బొగ్గు నిల్వ, సరఫరా సులభతరమైనా, ధూళి కాలుష్యం, శబ్ద కాలుష్యం, నీటి కలుషితం, స్వయం ప్రజ్వలనం, వ్యవసాయ నాశనం వంటి అనేక సమస్యలు ఊపందుకున్నాయి. స్థానిక ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడుతూ ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరిస్తున్నారు. - బొగ్గు ధూళి ఊపిరితిత్తుల ఆరోగ్యానికి పెనుప్రమాదం. సైలో బంకర్ వల్ల అధికంగా బొగ్గు ధూళి గాలిలో కలిసిపోతుంది. ఇది ఊపిరితిత్తుల వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపించి, ఆస్తమా, ఊపిరి తీసుకోవడంలో ఇబ్బంది, అలర్జీలు, కఫం సంబంధిత వ్యాధులు కలిగిస్తోంది. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు, శ్వాసకోశ సమస్యలున్నవారు తీవ్ర ప్రభావానికి గురవుతున్నారు. బంకర్‌లోని భారీ యంత్రాల శబ్దం రోజూ గంటల కొద్దీ ప్రజలను వేధిస్తోంది. పెద్ద శబ్దాల వల్ల తల నొప్పి, నిద్రలేమి, మానసిక ఒత్తిడి, కండరాల నొప్పులు వంటి సమస్యలు ప్రజలను ఇబ్బంది పెడుతున్నాయి. పంటలపై బొగ్గు ప్రభావం. సైలో బంకర్ ప్రాంతంలోని పంట పొలాలపై తీవ్ర ప్రభావం చూపిస్తోంది. బొగ్గు ధూళి గాలిలో కలిసి భూమిపై పడడంతో పంటలు నాశనమవుతున్నాయి, నేల నాణ్యత తగ్గిపోతోంది. సాగు భూములు నెమ్మదిగా ఉష్ణతావృత్తం అవుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



### స్థానికుల ఆందోళనలు

సత్తుపల్లి ప్రజలు ఈ సమస్యలను అధికారం ఉన్న ప్రతి స్థాయిలో తీసుకెళ్లినప్పటికీ, ఇప్పటి వరకు సరైన స్పందన రాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలుష్య నియంత్రణ కోసం తక్షణ చర్యలు చేపట్టకపోతే, పెద్ద ఎత్తున ఆందోళనలతో పాటు, న్యాయ పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు.

### నీటి కాలుష్యం -భూగర్భజలాల్లో విషతత్వం పెరుగుతోంది

సైలో నుంచి లీక్ అయ్యే బొగ్గు ధూళి, రసాయనాలు నీటి వనరులను తీవ్రంగా కలుషితం చేస్తున్నాయి. తాగునీటి లభ్యత తగ్గడంతో పాటు, నీటి నాణ్యత లోపించడంతో పేగు సంబంధిత వ్యాధులు, చర్మ సమస్యలు, జంతువుల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడుతోంది. కోల్ సైలోలో నిల్వ ఉంచిన బొగ్గు తేమ వల్ల వేడెక్కి స్వయంగా మంటలు అంటుకునే ప్రమాదం ఉంది. గతంలో ఇటువంటి ఘటనలు చోటుచేసుకున్నప్పటికీ, నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకోవడం లేదు. ఇది స్థానిక ప్రజలకు భారీ ముప్పుగా మారింది.

### అధికారుల హామీ

స్థానిక అధికారులు ధూళి నియంత్రణ కోసం అదనపు పరికరాలు అమర్చడం, నీటి కాలుష్యాన్ని నివారించేందుకు చర్యలు తీసుకోవడం, భద్రతా ప్రమాణాలు పెంచడం వంటి కార్యక్రమాలను త్వరలో చేపడతామని ప్రకటించారు. అయితే, ప్రజలు వాస్తవ చర్యలు కనిపించేవరకు నమ్మబోమని స్పష్టం చేస్తున్నారు.




## మాదిగల డప్పు ప్రదర్శన

**మధిర మార్చి 8 మహా:** మధిరలో మాదిగల డప్పు ప్రదర్శన కార్యక్రమం విజయవంతం అయింది తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత రాకముందే గ్రూప్ -1 , గ్రూప్ -2 ,గ్రూప్ -3, డబ్ల్యుహెచ్ ఓ తదితర ఉద్యోగ ఫలితాలు విడుదల చేయడం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న తీవ్ర అన్యాయమైన చర్య అని డప్పుల మహాప్రదర్శనకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇన్చార్జి ఏపూరి వెంకటేశ్వరావు మాదిగ అన్నారు తక్షణమే ఉద్యోగ నియమకాల ప్రక్రియ నిలిపి రేవంత్ రెడ్డి ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని తెలంగాణ మంత్రివర్గ విస్తీర్ణంలో మాదిగలకు ఇద్దరుకు అవకాశాలు కల్పించాలని ఉద్యోగ నియమకాలు చేపట్టడం ద్వారా మాదిగలు మరియు ఉప కులాలకు అలాగే ఎస్సీ వర్గీకరణ కోరుతున్న అన్ని కులాలకు తీవ్ర నష్టం జరుగుతుంది అని ఎస్సీ వర్గీకరణ చట్ట భద్రత కల్పించిన తర్వాతే ఉద్యోగ నియమాకుల చేపట్టాలని ఎస్సీ వర్గీకరణ జరిగేంతవరకు ఉద్యోగ నియామకాలు చేపట్టమని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎస్సీ వర్గీకరణ చేయకుండానే ఉద్యోగ నియామకాలకు సిద్ధపడడం చేపట్టడం దారుణం అని ఉద్యోగ నియామకాల ఫలితాలు వెంటనే నిలిపివేయాలి డిమాండ్ చేయడం జరిగింది ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించిన తరువాతనే అన్ని రకాల ఉద్యోగ ఫలితాలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ... మధిర కేంద్రంగా మాదిగల మహా డప్పు ప్రదర్శన వైఎస్ఆర్ సర్కిల్ నుండి అంబేద్కర్ విగ్రహం వరకు నిర్వహించడం జరిగింది అంబేద్కర్ కి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించడం జరిగింది ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు కూరపాటి సునీల్ మాదిగ, రాష్ట్ర నాయకులు కూరపాటి ప్రభాకర్ మాదిగ, ఎంఎస్పి జిల్లా నాయకులు కనకపుడి శ్రీను మాదిగ, ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు ఊటుకూరు రత్నాకర్ మాదిగ, రాష్ట్ర నాయకులు చిలక నాగరాజు మాదిగ, ఎమ్మెస్పీ నియోజకవర్గ నాయకులు కోట హనుమంతరావు మాదిగ, ఎన్టీఆర్ జిల్లా నాయకులు మంద పిచ్చయ్య మాదిగ, ఎం ఎస్ ఎఫ్ మండల అధ్యక్షులు వేల్పుల పవన్ కళ్యాణ్ మాదిగ, ఎమ్మార్పీఎస్ నాయకులు కొండురు రాజేష్ మాదిగ, రాయవరపు దేవదాస్ మాదిగ, ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## రూరల్ ఎస్సై లక్ష్మీ భార్గవికి ఘన సన్మానం



**మధిర మార్చి 8 మహా:** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మధిర రూరల్ పోలీస్ స్టేషన్లో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న లక్ష్మీ భార్గవిని మధిర మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్ ఆధ్వర్యంలో పుష్పగుచ్చం ఇచ్చి శాలువాలతో ఘన సన్మానం చేశారు ఈ సందర్భంగా సురంశెట్టి కిషోర్ మాట్లాడుతూ నేటి సమాజంలో మహిళలు పురుషుల కంటే ఎక్కువగా అన్ని రంగాల్లో రాణిస్తూ తమ యొక్క సమర్ధతను నిరూపించుకుంటున్నారని ఒకప్పుడు గృహానికి మాత్రమే పరిమిత అయినటువంటి మహిళా లోకం ఈ రోజు అంతరిక్షం లోకి వెళ్లే వరకు అభివృద్ధి చెందారని కావున మహిళ ఓ తల్లిగా చెల్లిగా గృహానిగా ఉద్యోగిగా సమాజంలో అన్ని రకాలైన పాత్ర నిర్వహిస్తుందని కావున వారిని గౌరవించుకోవడం మనందరి సామాజిక బాధ్యత అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఐలూరు సత్యనారాయణ రెడ్డి సీనియర్ కాంగ్రెస్ నాయకులు నిడమానూరు వంశీకృష్ణ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు అద్దంకి రవికుమార్ బాణావత్ రమణా నాయక్ మండల ఐ ఎన్ టి యు సి అధ్యక్షులు కోరంపల్లి చంటి రావిరాల సత్యనారాయణ సాకే దుర్గా తదితరులు పాల్గొన్నారు

# స్త్రీనిధి రుణాల కుంభకోణంపై విచారణ షురూ!




## వెలుగులోకి వచ్చిన 10 ఏళ్ల అవినీతి అక్రమాలు

- విచారణ ప్రారంభించిన జిల్లా యంత్రాంగం
- ఐకెపి కార్యాలయ రికార్డుల పరిశీలనలో అసత్య లావాదేవీల వెల్లడి
- క్షేత్రస్థాయిలో సైతం విచారణ చేపట్టిన అధికారులు

**ఖమ్మం - మహా:** ఖమ్మం జిల్లా కల్లూరు ఐకెపి కార్యాలయంలో గత దశాబ్దంగా సాగుతున్న భారీ అవినీతి బహిర్గతమైంది. వేలాది మహిళలకు స్త్రీనిధి ద్వారా రుణాలు మంజూరు చేసి, వారి తిరుగు చెల్లింపులను అక్రమంగా దారి మళ్లించిన వ్యవహారం బయటపడింది. 'మహా పత్రిక' కథనానికి జిల్లా యంత్రాంగం గంభీరంగా స్పందించి, విచారణ చేపట్టింది. రికార్డుల పరిశీలనలో అనేక అవకతవకలు వెల్లడికాగా, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికార యంత్రాంగం సిద్ధమైంది.

### 10 ఏళ్లుగా సాగుతున్న భారీ ఆర్థిక దోపిడి

కల్లూరు ఐకెపి కార్యాలయంలో నిన్న మొన్నటి దోపిడి కాదు, ఏకంగా దశాబ్ద కాలంగా కోట్ల రూపాయల అవినీతి నడుస్తోందని ఆడిట్ నివేదికలతో స్పష్టమైంది. మహిళా స్వయం సహాయ సంఘాలకు ఇచ్చిన రుణాలు పూర్తిగా తిరిగి చెల్లించినప్పటికీ, వాటిని అధికార యంత్రాంగం అక్రమంగా మళ్లించిన తీరు ఇప్పుడు వెలుగులోకి వచ్చింది.

### 'మహా పత్రిక' కథనానికి జిల్లా యంత్రాంగం స్పందన

ఈ వ్యవహారం గురించి 'మహా పత్రిక' కథనం ప్రచురించగానే జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. డి ఆర్ డి ఏ ఏపీడి నూరుద్దీన్ కల్లూరు ఐకెపి కార్యాలయానికి వెళ్లి రికార్డులను పరిశీలించారు. 45 గ్రామ సమైక్యలకు సంబంధించిన లావాదేవీలన్నీ ఒక్కొక్కటిగా పరిశీలించగా, అనేక వందల లక్షల రూపాయల అవకతవకలు వెలుగులోకి వచ్చాయి.

### రికార్డుల పరిశీలనలో అక్రమాల వెల్లడి

**తదుపరి దర్యాప్తులో, కొంతమంది అధికారుల ముఠా వేలాది మహిళలను మోసం చేసిన తీరును అధికారులు గుర్తించారు. రుణాలు తీసుకున్న సభ్యులు అప్పు తిరిగి చెల్లించినా, వారి పేర్ల మీద ఇంకా బాకీ చూపించడం గమనార్హం. బ్యాంక్ ఖాతాలు, లెక్కలపత్రాల్లో భారీ గోల్‌మాల్ బయటపడటంతో, ఈ వ్యవహారం మరింత లోతుగా దర్యాప్తు చేయాలని నిర్ణయించారు.**

### అవినీతి గుట్టును విడదీసిన ఏపీయం రాంబాబు

విధుల్లో చేరిన వెంటనే అవినీతి మహామాయకు అడ్డుకట్ట వేయాలని సంకల్పించిన ఏపీయం రాంబాబు, అనుమానాస్పద లావాదేవీలను పరిశీలించేందుకు క్లస్టర్ స్థాయిలో తనిఖీలు చేపట్టారు. దీనిలో భాగంగా రుణాల గోల్‌మాల్ బహిర్గతమైంది. తాను ఈ అవినీతిపై పోరాడేందుకు సిద్ధంగా ఉన్నానని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకునేలా తన వంతు ప్రయత్నం చేస్తానని ఏపీయం స్పష్టం చేశారు.

### విచారణ వేగవంతం.. బాధ్యులపై కఠిన చర్యలు తప్పవు

**ఈ స్కామ్‌పై విచారణ చేపట్టిన జిల్లా యంత్రాంగం మరింత లోతుగా దర్యాప్తు చేపట్టాలని నిర్ణయించింది. కలెక్టర్ ఆదేశాలతో రికార్డులను సేకరించి పూర్తి నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు అందించనున్నారు. అవినీతి ఆరోపణలు రుజువైతే, ఈ వ్యవహారాన్ని సీబీసీఐడీ లేదా ఎసిబి వంటి దర్యాప్తు సంస్థలకు అప్పగించే అవకాశం ఉందని విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. ఖమ్మం జిల్లా కల్లూరు ఐకెపి కార్యాలయంలో కోట్ల రూపాయల స్త్రీనిధి రుణాలను దుర్వినియోగం చేసిన అవినీతి ముఠా పసిగట్టబడింది. 'మహా పత్రిక' కథనంతో అప్రమత్తమైన జిల్లా యంత్రాంగం విచారణ ప్రారంభించి, దోషులపై కఠిన చర్యలకు సిద్ధమైంది. నిధులు దుర్వినియోగం చేసిన అధికారులపై కఠినంగా వ్యవహరించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.**

## మహిళావృద్ధి తోనే దేశాభివృద్ధి



**కామేపల్లి.మార్చి 8(మహా ):** మహిళలు సమాజం లో అసమానతతో చూడకుండా కుటుంబాన్ని పోషిచడం లో కీలక పాత్ర పోషిస్తున్నారని, కుటుంబం నుండి సమాజం వరకు ప్రతి రంగంలో వారు తమ ప్రతిభను రెప్పపాటు అలసి పోకుండా నిరంతరం శ్రమించి ఉన్నత స్థానాలను అధిరోహిస్తున్నారని శనివారం మల్లిబాబు యాదవ్ అన్నారు మహిళా దినోత్సవ సందర్భంగా అంగన్వాడీ ఆశా ఏ న్ మ్ ఘనంగా సన్మానించి అనంతరం మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా మహిళలు ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాల్లో అద్భుత విజయాలు సాధిస్తూ పురుషులతో సమానంగా ముందుకు సాగుతున్నారని, వారి ప్రగతికి సహకరించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు.ప్రస్తుతం మహిళలు వ్యాపారం, క్రీడలు, పరిశోధనలు, రాజకీయాలు, సైన్యం వంటి అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలుస్తూ తమ అసమాన ప్రతిభను ప్రదర్శిస్తున్నారని అన్నారు. సమాజంలో లింగసమానత కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, మహిళలపై అణచివేత, వివక్ష రహిత సమాజ నిర్మాణం కోసం ప్రభుత్వాలు, ప్రజాసంఘాలు, సామాజిక కార్యకర్తలు మరింతగా ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు. ఏఎన్ఎంలు. ఆశా కార్యకర్తలు. గ్రామ పెద్దలు బానోతు నరసింహ నాయక్. జక్కంపూడి వెంకటేశ్వర్లు. శీలం పుల్లయ్య. మేకల మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు

## విశ్వశాంతిలో మహిళా దినోత్సవ వేడుకలు




**సత్తుపల్లి, మార్చి8: మహా:** సత్తుపల్లి లో గల విశ్వశాంతి విద్యాలయంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా ఉపాధ్యాయులను శాలువాలతో సత్కరించారు. స్వీట్లు అందజేశారు. కేక్ కట్ చేసి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. మహిళా టీచర్లకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విశ్వశాంతి ప్రిన్సిపల్ పసుపులేటి నాగేశ్వరరావు మాట్లాడుతూ... ఒకప్పుడు మహిళల హక్కుల కోసం జరిగిన ఉద్యమ స్ఫూర్తికి చిహ్న 1975 సంవత్సరం నుంచి ప్రతి సంవత్సరం మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుగుతుందని అన్నారు. ప్రస్తుతం మహిళలు అన్ని రంగాల్లో పురుషులకంటే దీటుగా రాణించడం అభినందనీయమన్నారు. సమాజ పురోగతిలో స్త్రీ పాత్ర అనిర్వచనం అన్నారు. దేశ చరిత్రలో రాజ్యాలను ఏలిన రాణి రుద్రమ మొదలుకొని, భారతదేశ తొలి ప్రధాని ఇందిరా గాంధీ, అంతరిక్షంలో అడుగుపెట్టిన భారత తొలి మహిళ కల్పనా చావ్లా, భారత్లో మహిళా విద్యకు పాల్పడిన మొదటి మహిళ సావిత్రిబాయి పూలే... ఇలా ఎందరో మహిళలు మనకు స్ఫూర్తిదాయకంగా నిలిచారని, సమాజ తన వంతు కృషి చేశారని కొనియాడారు.

## ఉత్సాహంగా పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం



**ఖమ్మం - మహా:** శ్రీ కృష్ణ ప్రసాద్ మెమోరియల్ ఉన్నత పాఠ శాలలో శనివారం పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్కూల్ చైర్ పర్సన్ నిష్టా శర్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు 10వ తరగతిలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. ప్రతి విద్యార్థి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అకాంక్షించారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీ కృష్ణ ప్రసాద్ మెమోరియల్ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళలను స్కూల్ చైర్ పర్సన్ నిష్టా శర్మ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ శ్రీనివాస్ రాజు, ఉపాధ్యా యులు, విద్యార్థులు, తల్లి దండ్రులు పాల్గొన్నారు.

## జే.వి.ఆర్ సింగరేణి గని సందర్శించిన ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల జనరల్ సెక్రెటరీ



**సత్తుపల్లి, మార్చి 8: మహా:** సింగరేణి ఎస్సీ,ఎస్టీ ఉద్యోగస్తుల సంక్షేమ సంఘం జనరల్ సెక్రెటరీ ఆంతోని నాగేశ్వరరావు సత్తుపల్లి సింగరేణి జలగం వెంగళరావు ఉపరితల గనిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనను ఎస్సీ ఎస్టీ ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. అనంతరం నాగేశ్వరరావు మాట్లాడుతూ సింగరేణి కాలరీస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎన్. బలరాం సూచనలు మేరకు రక్షణతో కూడిన ఉత్పత్తులను సాధించాలని, ఈ ఆర్థిక సంవత్సరంలో 72 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తికి కార్మికులు సహకరించాలని కోయినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేనేజర్ గిడ్ల రాజు , వెల్ఫేర్ ఆఫీసర్ దేవదాసు, ఏ.ఐ.టి.యు.సి ఫిట్ సెక్రెటరీ నరసింహారావు, కేంద్ర కమిటీ సభ్యులు బందెల విజయేందర్, మనీష్ విక్టర్ , బీసీ సంఘ నాయకులు వంగపండ్ల సుమన్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మహిళా దినోత్సవం



**బోనకల్,మార్చి 08,మహా:** ఆళ్లపాడు గ్రామ పంచాయతీ కార్యాలయం నందు ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు,ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బోనకల్ సబ్ ఇన్స్పెక్టర్ కడగండ్ల మధుబాబు పాల్గొని మహిళా శక్తికి ప్రతీక గా నిలిచి సమాజంలో మార్పుకు నాంది పలికిన ప్రతి మహిళలకు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు,ఆల్లపాడు గ్రామపంచాయతీలో పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న మహిళలను ఘనంగా సన్మానించారు,పేద మహిళలకు చీరలు పంపిణీ చేయడం జరిగింది,ఈ కార్యక్రమంలో మధిర నియోజకవర్గగా ఆత్మ కమిటీ డైరెక్టర్ కందుల పాపారావు గ్రామపంచాయతీ సెక్రటరీ మల్లవరపు శ్రీనివాసరావు గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బుంగ రాములు సామాజిక కార్యకర్త మరీ ఇది బరకయ్య తోటకూర వెంకటేశ్వరరావు మంద రామారావు మందడపు రవి జంపాల రవి పంచాయతీ మహిళ ఉద్యోగులు షేక్ సైదాబీ తేళ్లూరి గౌరమ్మ తాళ్లూరి కళావతి వేల్పుల రత్నకుమారి షేక్ హుస్సేన్ బి పార పద్మ తదితరులు ఉన్నారు.

## మహిళను మహిళగా గుర్తించినప్పుడే నిజమైన మహిళా సాధికారికత

**మహా భద్రాచలం:** అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా జేడి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సమాజంలో వివిధ వృత్తులలో రాణిస్తూ కుటుంబాన్ని తీర్చిదిద్దుతున్న మహిళా మణులను ఘనంగా సన్మానించారు. భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానం ఈవో రమాదేవి, టౌన్ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ జయ భారతి, ఎంతోమంది అనాధలను చేరదీసి ఆశ్రయం కల్పిస్తున్న సరోజిని వృద్ధాశ్రమం వ్యవస్థాపకురాలు సరోజిని, భద్రాచలం సారపాక చుట్టుపక్కల వారికి ఎంతోమంది పిల్లలకు క్లాసికల్ మ్యూజిక్ నేర్పిస్తున్నటువంటి వెంపటి శ్యామల టీచర్ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జేడి ఫౌండేషన్ కోఆర్డినేటర్ హన్సి సభ్యులు కడాలి నాగరాజు, యూసఫ్ మియా, కుమారి శర్వాణి పాల్గొన్నారు.





# ఆధునిక మహిళలు.. ముందు తరాలకు ఆదర్శం

## మహిళా గెజిటెడ్ అధికారుల విజయోత్సవం

- సామాజిక సేవలోనూ ముందున్న మహిళలు
- పరిపాలనలో మహిళల కీలక పాత్ర
- ఉద్యోగ బాధ్యతలతో పాటు కుటుంబ సమతుల్యత
- క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలతో ఉత్సాహభరిత వేడుక



**ఖమ్మం - మహా:** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్ అసోసియేషన్ మహిళా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమం మహిళా సాధికారతకు ప్రతిబింబంగా నిలిచింది. ఈ వేడుకలో మహిళా గెజిటెడ్ అధికారులు తమ సేవా స్ఫూర్తిని చాటుతూ, అనేక రంగాల్లో ముందుకు సాగుతున్న నారీశక్తిని ప్రోత్సహించారు. సమాజంలో మార్గదర్శకత్వం వహిస్తున్న ఆధునిక మహిళలు భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలవాలన్న సందేశాన్ని ఈ కార్యక్రమం స్పష్టంగా ప్రతిబింబించింది.

### మహిళా గెజిటెడ్ అధికారుల విజయోత్సవం

తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్ అసోసియేషన్ మహిళా విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుక ఘనంగా జరిగింది. అధ్యక్షురాలిగా జి. ఉషశ్రీ, కార్యదర్శిగా పి. సుధారాణి బాధ్యతలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీజీవో రాష్ట్ర అధ్యక్షులు శ్రీ ఏలూరి శ్రీనివాసరావు పాల్గొని మహిళా అధికారుల దృఢ సంకల్పాన్ని ప్రశంసించారు. నేడు మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ, ఉద్యోగ సంఘాలలోనూ తమ స్థానాన్ని నిర్మించుకుంటున్నారని ఆయన అన్నారు.

### సామాజిక సేవలోనూ ముందున్న మహిళలు

ఈ సందర్భంగా డాక్టర్ పి. శ్రీజ, ఖమ్మం జిల్లా అడిషనల్ కలెక్టర్, ప్రత్యేక అతిథిగా హాజరై మహిళా అధికారులకు ప్రోత్సాహాన్ని అందించారు. ఖమ్మం జిల్లా పరిపాలనలో మహిళల పాత్ర ప్రాముఖ్యతను వివరించి, మహిళలు ఉద్యోగ బాధ్యతలతో పాటు కుటుంబ బాధ్యతలలోనూ సమతుల్యత సాధిస్తున్నారని ప్రశంసించారు. ఈ రోజుల్లో యువత చిన్న వయస్సులోనే ఉద్యోగాలు సాధించి తమ సామర్థ్యాన్ని నిరూపించు కుంటున్నారని ఆమె అభిప్రాయపడ్డారు.

### ఉద్యోగ బాధ్యతలతో పాటు కుటుంబ సమతుల్యత

మహిళా గెజిటెడ్ అధికారులు ఉద్యోగ బాధ్యతలతో పాటు కుటుంబ బాధ్యతలను సమర్థంగా నిర్వహిస్తున్నారు. నేటి ఆధునిక మహిళలు అన్ని రంగాలలో ముందుకు సాగి సమాజానికి మార్గదర్శకత్వం వహిస్తున్నారు. వారి సేవా తత్వం నేటి యువతకు మార్గదర్శకంగా నిలుస్తుంది.



### క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలతో ఉత్సాహభరిత వేడుక

ఈ వేడుకలో క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించగా, మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. మొత్తం 22 విభాగాలలో పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. డిపిఆర్ఓ ఆధ్వర్యంలో కళాబృందం ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్ అసోసియేషన్, టీఎన్జీవో, పీఆర్టీయూ, యూటీఎఫ్, వీటర్నరీ అసోసియేషన్ తదితర సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. మహిళా అధికారుల సమిష్టి కృషి, పరిపాలనా వ్యవస్థలో వారి పాత్ర, సమాజ సేవలో వారి సహకారం భవిష్యత్ తరాలకు మార్గదర్శకంగా నిలుస్తుందని ఈ వేడుక స్పష్టంగా తెలియజేసింది.

# మంత్రి పొంగులేటికి ధన్యవాదాలు

**కూసుమంచి, మార్చి 8,మహా:** కూసుమంచి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయడం పట్ల రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి కూసుమంచి మాజీ ఎంపీటీసీ మాదాసు ఉపేందర్ కృతజ్ఞతలు తెలిపారు. కూసుమంచి మండల కేంద్రంలో జూనియర్ కళాశాల కావాలనే అనేక సంవత్సరాలుగా ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ ఎవరు స్పందించలేదని గుర్తు చేశారు. రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన8 తొలిసారిగా కూసుమంచి వచ్చిన సమయంలో కూసుమంచికి జూనియర్ కళాశాల మంజూరు చేస్తానని హామినిచ్చారని, ఆ హామి మేరకు ఏడాది లోనే జూనియర్ కళాశాల మంజూరు చేయడం, తక్షణమే కళాశాలను మంత్రి ప్రారంభించారని తెలిపారు. అనంతరం మూడు నెలల్లోనే నూతన భవన నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.5.50



కోట్లను మంజూరు చేస్తూ ఉన్నత విద్యా ప్రభుత్వ సెక్రటరీ యోగిత్ రాణా ఈ నెల ఆరవ తేదీన ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. రూ.5 కోట్లను నూతన భవన నిర్మాణానికి, రూ.25 లక్షలను ల్యాబ్ పరికరాల కొనుగోలుకు, కంప్యూటర్లు, ఆఫీస్ పరికరాల కొనుగోలుకు మరో 25 లక్షలను మొత్తంగా రూ.5.50 కోట్ల నిధులను కేటాయించడం పట్ల కూసుమంచి మాజీ ఎంపిటిసి మాదాసు ఉపేందర్ రావు హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని నిధులు మంజూరు చేపించడం పట్ల పొంగులేటికి అభినందనలు తెలిపారు. కూసుమంచి మండలానికి ఇటీవల కాలంలో 100 పడకల ఆసుపత్రి మంజూరు చేపించడం తో పాటు విద్యార్థులకు జూనియర్ కళాశాలను నిధులు మంజూరు చేపించి కూసుమంచి మండలాన్ని అభివృద్ధిలో ముందుకు తీసుకెళు_న్నారని పేర్కొన్నారు. అందుకు గాను మంత్రికి కూసుమంచి మండల ప్రజల తరుపున, విద్యార్థుల తరుపునా ధన్యవాదాలు తెలిపారు. జూనియర్ కళాశాల వల్ల నిరుపేద, మధ్యతరగతి విద్యార్థులకు మేలు జరుగుతుందని అన్నారు. ప్రభుత్వ కళాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## సామాజిక వివక్ష, అణచివేతలపై ఉద్యమించాలి

**నెలకొండపల్లి, మార్చి 8 మహా :** సామాజిక వివక్ష, శ్రమ దోపిడి, దాడులు, అణిచివేతలపై మహిళలంతా సంఘటితంగా ఉద్యమించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి బండి పద్మ పిలుపునిచ్చారు. శనివారం నేలకొండపల్లిలోని సిపిఐ(ఎం) కార్యాలయంలో ఐద్వా మండల కమిటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై ఉద్యమిస్తూ స్పూర్తిగా నిలుస్తున్న ఐద్వా జిల్లా నాయకురాలు బెల్లం లక్ష్మితో పాటు ఇతర మహిళలను శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి ఆధునిక సమాజంలో పురుషులకు దీటుగా మహిళలు అన్ని రంగాలలో రాణిస్తూ స్పూర్తిగా నిలుస్తున్న వారు చేస్తున్న రంగాలలో అనునిత్యం సామాజిక వివక్ష, శ్రమదోపిడి, దాడులు,



వేధింపులు అణిచివేతలకు గురవుతూనే ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి పురుషుడి విజయం వెనక మహిళ ఉన్న ఆ మహిళ శక్తిసామర్థ్యాలను గుర్తించి ప్రోత్సహించే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా మండల అధ్యక్షురాలు బలుసు ప్రమీల, కూచిపూడి శ్రీదేవి, కాటన్ కోటేశ్వరి, ఎడవల్లి సైదమ్మ, స్వరూప, భద్రమ్మ, ఉమా, జానకమ్మ, స్వరూప, భాజా వనజ, సిపిఐ(ఎం) మండల కార్యదర్శి కెవి రామిరెడ్డి, ఏటుకూరి రామారావు తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ ఫలితాలు సాధించిన వారికి ప్రోత్సాహకాలు అందిస్తా

**నేలకొండపల్లి, మార్చి 8 మహా:** విద్యలో ప్రతిభ చూపే విద్యార్థులకు ప్రోత్సహకాలు అందిస్తానని మెదక్ జిల్లా ఎస్పీ డి.ఉదయ్కుమార్రెడ్డి పేర్కొన్నారు. ఆయన సొంత గ్రామమైన నేలకొండపల్లి మండలం లోని రామచంద్రాపురం లో ' శనివారం పర్యటించారు. ఇంటర్ లో 1000 మార్కులకు గాను, 982 మార్కులు సాధించి అత్యంత ప్రతిభ చూపిన గ్రామానికి చెందిన విద్యార్థి ని కేశా నవ్య కు గ్రామపెద్దలు, విద్యావంతులు కలిసి రూ.1.4 లక్షల ను" ప్రోత్సాహకం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు...పది, ఇంటర్ లో ప్రతిభ చూపే విద్యార్థులకు రూ.10 వేల నగదు బహుమతులు అందిస్తానని పేర్కొన్నారు. విద్యాభివృద్ధికి ప్రతీ ఒక్కరూ పాటుపడాలని సూచించారు. విద్యతోనే ఏదైనా సాధించవచ్చునని అన్నారు. గ్రామంలో విద్యావంతులు, గ్రామ పెద్దలు విద్య కోసం చేస్తున్న కృషి ని అభినందించారు.

## కూలీలకు డ్రింక్స్ అందించిన ఎంపీడీఓ



**నేలకొండపల్లి, మార్చి 8 మహా:** జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పధకం పనులను నేలకొండపల్లి ఎంపీడీఓ యం.యర్రయ్య శనివారం పరిశీలించారు. మండలం లోని అమ్మగూడెం గ్రామంలో ఉపాధి పనుల వద్ద కు వెళ్లి కూలీలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎండ తీవ్రత గుర్తించిన ఎంపీడీఓ స్వయంగా తన ఖర్చులతో కూల్ డ్రింక్స్ అందించారు. కూలీల వద్దకు వెళ్లి పేరు పేరు ను తెలుసుకుని డ్రింక్స్ ను అందించారు. మండల అధికారిఐ స్వయంగా డ్రింక్స్ అందించటం పట్ల ఉపాధి కూలీలు సంతోషం ను వ్యక్తం చేశారు. అనంతరం ఎంపీడీఓ కూలీలతో మాట్లాడారు...పనులు చేసే చోట వారికి కనీస సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ఎండ తీవ్రత ఉన్నందున్న తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కూలీల సంఖ్య ను మరింత పెంచేలా చూడాలని సిబ్బంది ని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈజీఎస్ ఈసీ శేషగిరిరావు, క్షేత్ర సహాయకురాలు పద్మ తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు

**నేలకొండపల్లి, మార్చి 8 మహా:** అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను శనివారం మండలం లో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆయా గ్రామపంచాయతీ కార్యాలయాలలో మహిళా దినోత్సవం సందర్భంగా...పలువురు మహిళలను సన్మానించారు. నేలకొండపల్లి మేజర్ పంచాయతీ కార్యాలయం లో ఎంపీడీఓ యం.యర్రయ్య ఆధ్వర్యంలో సిబ్బందీని సన్మానించారు. మహిళల హక్కుల గురించి వివరించారు. నేలకొండపల్లి లో మహిళా మోర్చా ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. మహిళలకు గాజులు పంపిణీ చేశారు.

## శ్రీ అష్టలక్ష్మి యాగం పనులు షురూ

**మహా భద్రాచలం:** అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం ఉష్ణ గుండాల సమీపంలో మార్చి 12 నుంచి 23 వరకు శ్రీ అష్టలక్ష్మి యాగం నిర్వహించే అమ్మవారి ఆశ్రమంలో నిర్మిస్తున్న ప్రధాన యాగశాలను, శ్రీ అష్టలక్ష్మి పీఠం వ్యవస్థాపకాచార్యులు శ్రీ పీతాంబరం రఘునాథచార్యులు స్వామీజీ మరియు కమిటీ సభ్యులు, గాదె మాధవరెడ్డి, గొంగడి వెంకటరామిరెడ్డి పరిశీలించడం



జరిగింది. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ, ఈ నెల 12 నుంచి 23 వరకు జరిగే శ్రీ అష్టలక్ష్మి అమ్మవారి యాగంలో పాల్గొనడానికి ఉభయ తెలుగు రాష్ట్రాల నుండే కాకుండా, సరిహద్దు రాష్ట్రాల నుండి వేలాది మంది భక్తులు తరలి రానున్నారని తెలిపారు. 50 మంది వేద పండితులతో ప్రతిరోజు నిర్వహించే యాగ కార్యక్రమాలలో ప్రజలందరూ కూడా దంపతులుగా వచ్చి పాల్గొని అమ్మవారి అనుగ్రహాన్ని పొందాలని సూచించారు.

## సీపీఎం, ఐద్వా ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం

**కూసుమంచి, మార్చి 8,మహా:** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కూసుమంచి మండల కేంద్రంలో రెండు సెంటర్సులో ఐద్వ మరియు సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో మహిళా సదస్సు జరిగింది మహిళలపై జరుగుతున్న ఆకృత్యాలకు



వ్యతిరేకంగా సమాన హక్కుల కోసం పోరాడుతూ తమ వ్యక్తిత్వాన్ని కాపాడుకుంటూ కుటుంబంలో తమ వంతు పాత్ర పోషిస్తూ తల్లిగా చెల్లిగా గృహిణిగా సమాజంలో మార్పు కోసం తన కుటుంబం నుంచే తన పిల్లల్ని ఈ సమాజంలోని అసమాన తలని అలాగే ఆర్థిక లైంగిక దోపిడీకి వ్యతిరేకంగా తమ పిల్లల్ని పెంచి పోషించాలని తమ కుటుంబం నుంచే మరొక పుచ్చల పల్లి సుందరయ్య లాగా ఆదర్శమైన వ్యక్తిగా పెంచాలని ఈ సమాజంలో మార్పు కోసం పోరాడాలని ఈ సదస్సులో మాట్లాడిన మహిళా సంఘం నాయకురాలుతాళ్ళూరిఅనిత అనిత బిక్కసాని విజయ దార సోనీ బెల్లం నాగమణి తదితరులు మాట్లాడారు కుటుంబ భారాన్నే కాకుండా ఈ సమాజంలో జరుగుతున్న సమస్యలను బాధ్యతగా తీసుకొని ప్రతి మహిళ తమ వంతు కృషి చేయాలని అలాగే తమ కుటుంబంలో తను పూర్తి స్వేచ్ఛను అనుభవించాలని పై బాధ్యులు కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా నాయకులు మల్లెల షన్మతరావు మండల కార్యదర్శి తొటకూరి రాజాశేర్ కార్యదర్శి వర్గ సభ్యులు తాళ్లూరి వెంకటేశ్వరరావు మహిళా సంఘం సభ్యులు కమలమ్మ రాంబాయి లక్ష్మీకాంతమ్మ ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలవాలి

**బోనకల్, మార్చి 08, మహా:** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మండలం గోవిందపురం ఎల్ గ్రామంలో మధిర డివిజన్ ఐద్వా అధ్యక్షురాలు జొన్నలగడ్డ సునీత ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ



సందర్భంగా మహిళలను ఉద్దేశించి మాట్లాడుతూ అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవం అనేది పది గంటల పనిదినాల కోసం, పురుషులతో సమానమైన వేతనాల కోసం,ఓటు వేసే హక్కు కోసం న్యూయార్క్ సిటిలో 15 వేల మంది మహిళలు 1908లో ప్రదర్శన చేశారు. ఈ మహిళల డిమాండ్లను దృష్టిలో పెట్టుకొని అమెరికాలోని సోషలిస్టు పార్టీ 1909వ సంవత్సరములో ఫిబ్రవరి 28వ తేదిన మహిళా దినోత్సవం నిర్వహించింది. సామాజిక మార్పుకు అభివృద్ధికి మూలం విద్యే. ప్రతి స్త్రీ కనీస విద్యార్హతలు సంపాదించేలా చూడాలి. ఈ కార్యక్రమంలో తుళ్లూరి విమల మహిళా సంఘం నాయకురాలు నల్లమోతు వాణి ,షేక్ చాందా ,కారంగుల పద్మ , ఉమ్మినేని లక్ష్మి ,పెద్దప్రోలు ధనమ్మ,కారంగుల వినోద ,షేక్ కాసింబీ, జుజ్జూరునిర్మల పాల్గొన్నారు.

## పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిభిరం

**బోనకల్, మార్చి 08, మహా:** మండలంలోని చిరునోముల గ్రామంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ (వైరా),పశు సంవర్ధక శాఖ ఖమ్మం వారి సంయుక్తంగా బోనకల్ యూనిట్ సూపర్వైజర్ వెంకటేశ్వర్లు సమక్షంలో గోపాలమిత్ర వారి ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరం మండల పశు వైద్య అధికారి డాక్టర్ అన్వేష్ చే నిర్వహించినారు,ఈ శిబిరం నందు గర్భకోశ వ్యాధులు, చూడి పరీక్షలు,ఎదకురాని పడ్డలు,వివిధ రకాల వ్యాధులు పరీక్షలు చేసి చికిత్స నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు,లేగ దూడలకు నట్టల నివారణ మందులు త్రాగించారు,ఈ సందర్భంగా వైద్య అధికారి అన్వేష్ మాట్లాడుతూ వేసవిలో పాడి పశువుల పట్ల జాగ్రత్తలు తీసుకొవాలని శనివారం గ్రామంలో పాలపోటీలు నిర్వహించడం జరిగింది,అందులో గెలుపొందిన వారికి బహుమతులు అందజేయడం జరిగింది. ముఖ్యంగా నాణ్యమైన పశుగ్రాసాలు మేపినట్లైతే సకాలంలో ఆరోగ్యంగా ఉంటూ ఎదకు వచ్చి చూలు కడతాయని దీనివలన పశుపోషకులు ఆర్థికంగా లబ్ధి చేకూరుతుందని వివరించారు.

## ఆధునిక వ్యవసాయ పద్ధతులు అనుసరించాలి




**వైరా - మహా:** ఆధునిక వ్యవసాయ పద్ధతులు అనుసరించి అధిక దిగుబడులు సాధించాలని వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ చైతన్య అన్నారు. శనివారం వైరా ఠాగూర్ కాలేజీ లో రైతు మహిళా నాయకురాలు,మాజీ ఎంపిపి బొంతు సమత అధ్యక్షతన జరిగిన ఖమ్మం జిల్లా మహిళా రైతు సదస్సు లో ముఖ్య అతిథిగా వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ చైతన్య మాట్లాడుతూ వ్యవసాయ రంగం లో అనేక మార్పులు జరుగుతున్నాయి అని అన్నారు, ఆధునిక వ్యవసాయ పద్దతులు అనసరించకపోతే దిగుబడులు గణనీయంగా తగ్గే అవకాశం ఉందని, వాతావరణ మార్పులు కు అనుగుణంగా పంటలు సాగు చేయాల్సి అవసరం ఉందని అన్నారు.సన్న చిన్న కారు రైతులు, కౌలు రైతుల సాగు లో కుటుంబ సభ్యులు శ్రమ ఎక్కువగా ఉంటుంది అని అన్నారు. తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వ్యవసాయ విధానాలు రైతులను సాగుకు దురుము చేస్తున్నాయి అన్నారు.

## సోషల్ మీడియా పోస్టుల విషయమై దాడి



**కారేపల్లి, మహా:** భూ వివాదం, సామాజిక మాద్యమాలలో పోస్టుల విషయమై ఇరువర్గాల మధ్య రగులుతున్న గొడవ భౌతిక దాడులకు దారితీసింది. దీనిపై బాధితుడు కారేపల్లి పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేయగా ముగ్గురు వ్యక్తులపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై ఎన్,రాజారాం తెలిపారు. పోలీసులు కథనం ప్రకారం.. ఉసిరికాయలపల్లికి చెందిన పచ్చిపాల వెంకట్, అదే గ్రామానికి చెందిన బోడ సేట్రాం, సంజయ్, భాగ్యనగర్‌తండాకు చెందిన గుగులోత్ నారాయణ మధ్య వివాదం నడుస్తుంది. ప్రతి అంశాన్ని పచ్చిపాల వెంకట్ సామాజిక మాద్యమాలలో పోస్టులు పెడుతుండటంతో ఇటీవల పచ్చిపాల వెంకట్‌తో సేట్రాం, సంజయ్, నారాయణ లకు గొడవ జరిగింది. దీంతో వెంకట్‌పై ముగ్గురు దాడి చేశారు. ఈవిషయమై పచ్చిపాల వెంకట్ పిర్యాదుపై దాడి చేసిన ముగ్గురుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. వారిలో నారాయణకు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

## ఘనంగా మహిళ దినోత్సవం వేడుకల



**ఖమ్మం - మహా:** అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను దినోత్సవం శనివారం జిల్లాలో అంగరంగ వైభవ నిర్వహించారు. ఆయా హాస్పిటల్ లో డాక్టర్లు సిస్టర్లు హాస్పటలలో పేషంట్ల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు మహిళలను సన్మానించారు. పలువురు డాక్టర్ల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో, ప్రసన్న, అనిత, శిరీష ,కళ్యాణి, నిర్మల, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

## మహిళా ప్రాంగణ అధికారి వేల్పుల విజేతకు ఘన సన్మానం



**ఖమ్మం టౌన్,మార్చ్ 8, మహా:** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళా ప్రాంగణ అధికారిని వేల్పుల విజేత ను అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర జిల్లా నాయకులు సన్మానించినారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ జిల్లాలో ఎంప్లాయిమెంట్ ఆఫీసర్గా మహిళా ప్రాంగణ అధికారిణ్ని గా నిరుద్యోగులకు అటు మహిళలకు అనేక శిక్షణ కార్యక్రమాలు ఉద్యోగాలు కల్పించడంలో వారి యొక్క కృషి చాలా గొప్పదని వారు ఈ సందర్భంగా తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం జాతీయ అధ్యక్షులు లింగాల రవికుమార్ , యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు దామల సత్యం, యువజన సంఘం జిల్లా అధ్యక్షులు కొప్పుల రామారావు ,యువజన సంఘం రాష్ట్ర నేతలు గుడిసె సాల్మన్ బాబు, రాజీవ్ కై తదితరులు పాల్గొన్నారు.



# కోడిపుంజు వివాదం అదనపు ఎస్సై దాష్టీకం

## కోళ్ల ఫారంలో చిత్రహింసలు దళితుడికి కరెంట్ షాక్‌లు

## విచారణ పేరుతో అమానుషంగా వ్యవహరించిన అదనపు ఎస్సై

**అశ్వారావుపేట మార్చి 8, మహా:** అశ్వారావుపేటలో అదనపు ఎస్సై రామ్మూర్తి అకృత్యం వెలుగుచూసింది. ఓ కోడిపుంజు వివాదంలో నారంవారిగూడెం గ్రామానికి చెందిన కలపాల నాగరాజును చిత్రహింసలకు గురిచేయడం కలకలం రేపుతోంది. ఫిబ్రవరి 20న దాసరి అప్పారావు అనే వ్యక్తి కోడిపుంజు పోయిందంటూ ఫిర్యాదు చేశాడు. ఈ కేసులో కలపాల నాగరాజుపై అనుమానం ఉన్నట్లు అదనపు ఎస్సై రామ్మూర్తి విచారణ చేపట్టాడు. కానీ విచారణ పేరుతో నాగరాజును ఓ కోళ్ల ఫారానికి తీసుకెళ్లి%% దారుణంగా కొట్టడమే కాకుండా కాళ్లకు కరెంట్ షాక్‌లు పెట్టి చిత్రహింసలకు గురిచేశాడు. తీవ్ర గాయాలపాలైన బాధితుడు ఆస్పత్రి పాలయ్యాడు.

### న్యాయం జరగాలి

**తన భర్త ఆరోగ్య పరిస్థితి మరింత విషమించిందని, ఇంకా పూర్తిగా కోలుకోలేదని బాధితుడి భార్య మమత ఆవేదన వ్యక్తం చేసింది. ఒక తప్పుడు ఆరోపణతో నిరుపేద దళితుడిపై పోలీసు అధికారుల అత్యాచారం తట్టుకోలేనిదని దళిత సంఘాలు మండిపడుతున్నాయి.**

### వెంటనే చర్యలు తీసుకోవాలి

విచారణ పేరుతో చిత్రహింసలు అమలు చేయడం తగదని దళిత సంఘాల నాయకుడు రాంబాబు వ్యాఖ్యానించాడు. అదనపు ఎస్సై రామ్మూర్తిని విధుల నుంచి తొలగించి%% బాధితుడికి న్యాయం చేయాలని డిమాండ్ చేశాడు. మరోవైపు పోలీసు ఉన్నతాధికారులు విచారణ చేపట్టినట్లు సమాచారం.

### ఇంకా ఎంతకాలం పోలీసులు ఇలాగే..

స్వేచ్ఛా భారతదేశంలో కేవలం అనుమానంతో ఓ వ్యక్తిని విచక్షణారహితంగా చిత్రహింసలు పెట్టడమేంటి? అదీ న్యాయాన్ని పరిరక్షించాల్సిన పోలీసులే ఇలాంటి దాష్టికానికి పాల్పడితే ప్రజలు న్యాయం ఎక్కడ వెతుకుకోవాలి? దళితుడిపై అమానుషంగా వ్యవహరించిన ఈ అదనపు ఎస్సైపై తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాలు, దళిత నేతలు డిమాండ్ చేస్తున్నారు. బాధితుడికి పూర్తి న్యాయం జరిగేంత వరకు పోరాడతామని స్పష్టం చేస్తున్నారు.

## జాతీయ లోక్ అదాలత్‌లో 20,029 కేసుల పరిష్కారం



### పరిష్కరించిన కేసుల విభజన

- నేర నిబంధనల కేసులు - 784
- సూక్ష్మ నేర కేసులు - 721
- రవాణా నిబంధనల కేసులు-16,288
- జరిమానా మొత్తం: 50,88,615
- ధన సంబంధిత కేసుల తీరుశకం - 2,162
- సమాచార నేర కేసులు - 78 (తిరిగి చెల్లించాల్సిన మొత్తం: 7,21,506)

**ఖమ్మం - మహా:** న్యాయ వ్యవస్థలో పెండింగ్‌గా ఉన్న కేసుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నది. దీన్ని తగ్గించేందుకు, తక్కువ కాలంలో, తక్కువ వ్యయంతో న్యాయం అందించేందుకు లోక్ అదాలత్‌లను ఏర్పాటు చేస్తారు. ఇటీవలి లోక్ అదాలత్‌లో 20,029 కేసులు పరిష్కారమయ్యాయి. దీనికి కృషి చేసిన పోలీసు సిబ్బందిని జిల్లా పోలీసు అధికారి అభినందించారు. ఎన్నికెన్నికలుగా వాయిదా పడుతూ న్యాయస్థానాల్లో పెండింగ్‌గా ఉండే కేసులకు శాశ్వత పరిష్కారంగా లోక్ అదాలత్‌లు మారుతున్నాయి. చిన్నచిన్న వివాదాలు, ఆర్థిక సమస్యలు, రవాణా జరిమానాలు, సమాచార నేరాలు తదితర కేసులు కోర్టుల వద్ద సంవత్సరాల పాటు ఊరుకునే పరిస్థితిని తొలగించేందుకు ఇవి ఉపకరిస్తున్నాయి. జిల్లాలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో పోలీసులు కీలక భూమిక పోషించారు. నిందితులకు, కక్షిదారులకు ముందస్తుగా సమాచారం అందించి, వారిని అవగాహన కల్పించి రాజీ మార్గంలో పరిష్కారం చేయడానికి సహకరించారు. జాతీయ లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారానికి పోలీసు శాఖ చేసిన కృషిని జిల్లా పోలీసు అధికారి అభినందించారు. లోక్ అదాలత్‌లను సద్వినియోగం చేసుకుంటే, కేసుల ఊబిలో చిక్కుకాకుండా తగిన పరిష్కారాన్ని పొందవచ్చని ఆయన సూచించారు. రాజీ మార్గంలో కేసులు ముగిస్తే, బాధితులకు న్యాయం అందడమే కాకుండా, న్యాయస్థానాలపై భారం కూడా తగ్గుతుందని పేర్కొన్నారు.

09
FOLLOW: @ANNTELUGU
9-3-2025
WWW. EPAPER.MAHAADAILY.COM
భద్రాద్రి కొత్తగూడెం
మహా పత్రిక
ANN తెలుగు



# పార్టీ విధేయులకే పదవులు!

## మీనాక్షి నటరాజన్ సంచలన నిర్ణయం

- పదవుల పంపకంలో కీలక మార్గదర్శకాలు
- అవకాశవాదులకు తలుపులు మూసివేత!
- పార్టీ కోసం కష్టపడ్డవారికే గౌరవం
- పార్లమెంట్ ఎన్నికల తరువాత వచ్చిన వారికి నో చాన్స్!
- నిజమైన ప్రజా నాయకత్వానికే ప్రాధాన్యత
- ఫ్లెక్సీల రాజకీయం కాదు, ప్రజల్లో మమేకమయ్యేవారికే భవిష్యత్తు
- పార్టీ కోసం పనిచేసే వారికే నామినేటెడ్ పదవులు

ఖమ్మం - మహా: రాజకీయ పార్టీలకు నిజమైన బలం ఆ పార్టీ సిద్ధాంతాలను నమ్మి, ప్రజల కోసం పని చేసే నాయకత్వమే. కానీ, ఎన్నికల సమయాల్లో పలువురు నేతలు రాజకీయ లాభం కోసం పార్టీ మారటం, ఓటమి ఎదురైన వెంటనే మరో పార్టీలోకి వెళ్లడం సహజంగా మారింది. అయితే, కాంగ్రెస్ అధిష్ఠానం( మీనాక్షి నటరాజన్) తాజాగా తీసుకున్న కీలక నిర్ణయం రాజకీయాల్లో ఓ కొత్త అధ్యాయాన్ని ప్రారంభించనుంది. పార్టీ కోసం దీర్ఘకాలంగా సేవలందించిన వారికే పదవులు, నామినేటెడ్ హెూదాలు ఇవ్వాలని స్పష్టంగా నిర్ణయించడం ద్వారా కాంగ్రెస్, అవకాశవాదులకు తలుపులు మూసేసింది.

### కొత్తవారికి వేచి చూడాల్సిందే!

ఎన్నికలు వచ్చినప్పుడు కొత్తవారి ప్రవేశం సాధారణం. కానీ, కేవలం పదవుల కోసమే చేరిన వారు కాంగ్రెస్‌లో ఇకపై లాభపడలేరని ఈ నిర్ణయం ద్వారా స్పష్టమైంది. అసెంబ్లీ ఎన్నికల ముందు పార్టీలో చేరిన కొత్తవారికి 30% పదవులను కేటాయిస్తామని కాంగ్రెస్ ప్రకటించింది. కానీ, అసెంబ్లీ, పార్లమెంట్ అనంతరం పార్టీలో చేరినవారికి ఒక్క పదవీ దక్కదని తేల్చేసింది. కాంగ్రెస్‌ను నిజంగా నమ్మి, ఎప్పుడూ పార్టీతోనే ఉన్న వారికి గౌరవం కల్పించాలన్నది అధిష్ఠానం ధ్యేయంగా పెట్టుకుంది.

### ప్రజల్లో మమేక మయ్యేవారికే భవిష్యత్తు!

ఇటీవల రాజకీయాల్లో గ్లామర్ రాజకీయాలు విస్తరిస్తున్నాయి. ఫ్లెక్సీలు వేసుకుని, ప్రకటనలు చేసుకుంటే చాలు, ప్రజాదరణ వస్తుందనే భ్రమలో చాలామంది నేతలు ఉన్నారు. కానీ, కాంగ్రెస్ అధిష్ఠానం స్పష్టంగా తేల్చి చెప్పింది %–% ప్రజల్లో మమేకమయ్యే నాయకులకే భవిష్యత్తు ఉందని! ప్రజా సమస్యలపై స్పందించే వారికే పార్టీలో స్థానం ఉంటుందని కాంగ్రెస్ చెబుతోంది. ఫ్లెక్సీల రాజకీయానికి స్వస్తి చెప్పి, మైదానంలో కష్టపడే వారికే భవిష్యత్తు ఉన్నదనే సంకేతాలను పంపిస్తోంది.

### పార్టీని భవిష్యత్తుకు నడిపించే కొత్తతరం సిద్ధం!

కాంగ్రెస్ ఈ నిర్ణయంతో యువతకు మరింత ప్రాధాన్యం ఇచ్చేందుకు సిద్ధమైంది. గ్రామ స్థాయి నుంచి కష్టపడి పనిచేసే యువకులు, పార్టీ సిద్ధాంతాలను నమ్మి పని చేసే వారికి కమిటీల్లో, నామినేటెడ్ పదవుల్లో చోటు కల్పించాలని నిర్ణయించింది. ఇది కొత్త నాయకత్వాన్ని ప్రోత్సహించే దిశగా కీలక అడుగుగా మారనుంది. యువత రాజకీయాల్లో నిజాయితీగా ఉంటేనే ప్రజాస్వామ్యం బలోపేతమవుతుందనే అవగాహనతో కాంగ్రెస్ ఈ విధానాన్ని అవలంబిస్తోంది.

### స్వార్ధపరులకు తలుపులు మూసిన కాంగ్రెస్!

కాంగ్రెస్ తీసుకున్న తాజా నిర్ణయం స్వార్థ రాజకీయాలకు చెక్ పెడుతోంది. ఓటమిని తట్టుకోలేక పార్టీ మారేవారికి ఇక అవకాశమే లేదని స్పష్టమైన సంకేతాన్ని ఇచ్చింది. “నమ్మకాన్ని వమ్ము చేయవద్దు %–% పార్టీని ఆపదలో వదిలినవారికి ఇక చోటు లేదు” అనే నినాదాన్ని కాంగ్రెస్ అమలు చేయబోతోంది. పార్టీ మారి మళ్లీ పదవుల కోసం వచ్చేవారికి తలుపులు మూసేస్తూ, దీర్ఘకాలం పార్టీ కోసం పనిచేసినవారికి గౌరవం కల్పించేందుకు కాంగ్రెస్ సిద్ధమైంది. కాంగ్రెస్ తీసుకున్న ఈ సంచలన నిర్ణయం పార్టీ భవిష్యత్తును మార్చనుంది. పదవుల కోసం పార్టీలో చేరేవారు ఇకపై అవకాశాల కోసం ఎదురుచూడాల్సిందే. పార్టీని నమ్మి, కష్టపడి పనిచేసినవారికే గౌరవం లభించనుంది. “సమయస్ఫూర్తితో పనిచేసేవారికే భవిష్యత్తు %–% కేవలం లాభం కోసం వచ్చిన వారికి తలుపులు మూసివేస్తాం” అనే స్పష్టమైన సంకేతాలను కాంగ్రెస్ పంపిస్తోంది. ఈ విధానం ద్వారా పార్టీలో నిజమైన నాయకత్వం ఎదగడానికి కొత్త మార్గం సిద్ధమవుతోంది!

